క్లుప్తంగా

ఘనంగా పూర్ణాహుతి



నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శుక శామలాంబ అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. ఆలయ ఈవో గంగాధర్, వంశపారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళిరాఘవకుమార్, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.1.20లక్షలతో డొంకరోడ్డు అభివృద్ధి



గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లిలో పొలాలకు వెళ్లే డొంకరోడ్డును రూ.1.20లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు. జేసీబీ సాయంతో చేపట్టిన ఈ పనులను సర్పంచి బొక్కా రవికుమార్ ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా సర్పంచి రవికుమార్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు డొంకరోడ్డును అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. డొంకరోడ్డు అభివృద్ధి పనులు చేపట్టడంతో పొలాలకు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు తప్పాయని గ్రామానికి చెందిన రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

నేడు ఆర్డీవో కార్యాలయంలో స్పందన

నందిగామ: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రభుత్వం ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో పి.సాయిబాబు తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని ఆయన వివరించారు.

కంచికచర్లలో..

కంచికచర్ల : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం పదిగంటలకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహశీల్దార్ షేక్ నాగుల్‌మీరా తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు అర్జీలు అందజేయవచ్చని వివరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీటీ కోరారు.

అన్నదానానికి రూ.50 వేలు విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం విజయవాడలోని మొగల్రాజపురానికి చెందిన నిమ్మగడ్డ ప్రణీత్ రూ.50వేలను విరాళంగా ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

కూచిపూడి కళాకారిణికి వాషింగ్టన్ యూనివర్సిటీ డాక్టరేట్

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ నగరానికి చెందిన కూచిపూడి కళాకారిణి బి.స్వర్ణలతకు అమెరికాలోని జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీ ఆఫ్ పీస్ నుంచి గౌరవ డాక్టరేట్ లభించింది. ఈ నెల 24న బెంగళూరులో జరిగిన అంతర్జాతీయ పీస్ కాన్ఫరెన్స్‌లో యూనివర్సిటీ పలు రంగాలకు చెందిన వారికి డాక్టరేట్‌లు ప్రదానం చేసింది. అందులో భాగంగా కూచిపూడి కళాకారిణి స్వర్ణలతకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నీతి ఆయోగ్ ఐఈఎస్ సలహాదారు శివప్ప, సెక్రటరీ జనరల్ డాక్టర్ శ్రీనివాస్ ఏలూరి, ఆ యూనివర్సిటీ డైరెక్టర్ నీలమణి తదితరుల నుంచి డాక్టరేట్ అందుకున్నారు.

కమనీయం శ్రీవారి మహా పుష్పయాగం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లో కొలువై ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి మహాపుష్పయాగం ఆదివారం కమనీయంగా జరిగింది. బ్రాహ్మణవీధిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన వివిధ రకాల సుగంధ పరిమళాలను వెదజల్లే పలు రకాల పుష్పాలతో కలియుగ దైవమైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి అర్చకస్వాములు పుష్పయాగాన్ని నయనానందకరంగా నిర్వహించి భక్తులను తరింపజేశారు. గులాబీ, తులసీ, మల్లె, చామంతి వంటి పుష్పాలతో జరిగిన పుష్పయాగాన్ని తిలకించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

విద్యలో సమూల మార్పులు

- నాడు–నేడుతో మారిన ప్రభుత్వ బడులు
- కార్పొరేట్ హంగులతో వసతులు
- ఆధునిక పద్ధతుల్లో విద్యాబోధన
- 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు
- రుచికరంగా జగనన్న గోరుముద్ద



సీఎం జగనన్న ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లు చూపిస్తున్న విద్యార్థులతో విప్ సామినేని ఉదయభాను(ఫైల్)

పెనుగంచిప్రోలు: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెచ్చింది. రాష్ట్రంలో విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చేపట్టడంతోపాటు దేశమే మెచ్చేలా నూతన సంస్కరణలను అమలుల్లోకి తీసుకువచ్చింది. దీంతో సీఎం జగనన్న నాలుగునెలల తొమ్మిది నెలల పాలనలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ హంగులతో, ఆధునిక బోధనా పద్ధతులతో నూతన ఒరవడికి నాంది పలికాయి.

ఇంగ్లిష్ మీడియం ప్రారంభం..

పేద, మధ్యతరగతి ప్రజల పిల్లలు కూడా ధనవంతుల మాదిరి ఇంగ్లిష్ చదువులు చదువుకోవాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను ప్రారంభించారు. జగనన్న గోరుముద్ద పేరుతో విద్యార్థులకు గుడ్లు, రాగిజావ, చిక్కీలతోపాటు అన్నం, ఆకు కూరలు అందిస్తున్నారు.

విద్యాకానుక పేరుతో..

పాఠశాల తెరిచిన మొదటిరోజే విద్యాకానుక విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, మూడు జతల యూనిఫాం, బెల్ట్, షూస్, బ్యాగ్‌ను ఏటా అందిస్తున్నారు. 6నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్ల (ఐఎఫ్‌పీ) ద్వారా డిజిటల్ విద్య, ప్రాథమిక స్థాయి విద్యార్థులకు స్మార్ట్ టీవీల్లో విద్యాబోధన అందిస్తున్నారు. ఇందుకు గాను మండలంలో మొదటి ఫేజ్‌లో పాఠశాలలకు 102ఐఎఫ్‌పీ ప్యానెల్, 145 స్మార్ట్ టీవీలు అందజేశారు.

అమ్మఒడి ద్వారా ఆర్థిక సాయం..

పేద పిల్లలను చదివించుకునేందుకు తల్లుల ఖాతాలో ఏటా ఒక్కో తల్లి బ్యాంకు ఖాతాలో రూ.15 వేలు జమ చేస్తున్నారు. ప్రైవేట్ స్కూళ్లలో చదివే పిల్లలకు కూడా అమ్మఒడి ఇవ్వడం సీఎం జగనన్న గొప్పమనస్సుకు నిదర్శనమని విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. అమ్మఒడి కింద నియోజకవర్గంలో 11,230మంది విద్యార్థుల తల్లులు లబ్ధిపొందారు.

2457మందికి ట్యాబ్‌లు..

అన్ని తరగతుల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పీడీఎఫ్ రూపంలో ఆన్‌లైన్‌లో ఉంచడంతోపాటు



తరగతి గదిలో డిజిటల్ విద్యా బోధన

బైజూస్ కంటెంట్‌తో 8వతరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో 8వతరగతి చదువుతున్న 2,457 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను ఉచితంగా అందజేశారు. ఇలా విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఏటా బడ్జెట్‌లో విద్యరంగం కోసం వేలాది కోట్ల రూపాయలను కేటాయిస్తోంది. విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని తాను నమ్మిన సిద్ధాంతం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగ అభివృద్ధికి విశేషంగా కృషిచేస్తుండటంపై ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మా ఇంట చదవుల వెలుగులు నింపేందుకు జగనన్న విశేషంగా కృషిచేస్తున్నారంటూ సంతోషపడుతున్నారు.

నాడు–నేడు కింద రూ.58కోట్లు..



నాడు–నేడు ద్వారా రూపురేఖలు మారిన కొణకంచి ఆదర్శ ప్రాథమిక పాఠశాల

జగ్గయ్యపేట నియోజకవర్గంలో మొత్తం ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ పాఠశాలలు 137ఉండగా, విద్యార్థులు 15,807మంది చదువుతున్నారు. నాడు–నేడు మొదటి కింద జగ్గయ్యపేట మండలంలో 25 పాఠశాలలకు రూ.7.51కోట్లు, పెనుగంచిప్రోలు మండలంలో 16 పాఠశాలలకు రూ.3.45కోట్లు, వత్సవాయి మండలంలో 26 పాఠశాలలకు రూ.5.51కోట్లు కేటాయించారు. రెండో విడత కింద జగ్గయ్యపేట మండలంలో 57పాఠశాలలకు రూ.21.53 కోట్లు, పెనుగంచిప్రోలు మండలంలో 31 పాఠశాలలకు 11.42కోట్లు, వత్సవాయి మండలంలో 24 పాఠశాలలకు రూ.9.28కోట్లు కేటాయించారు. ఈ నిధులతో ఆయా పాఠశాలలో కార్పొరేట్ స్థాయిలో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణం, విద్యార్థుల కోసం బల్లలు, మంచినీటి వసతితోపాటు అనేక సదుపాయాలు కల్పించారు.

బడి మారింది..



జగన్ మామయ్య ప్రభుత్వం వచ్చాక మాబడి మారింది. తరగతి గదులను కూడా పూర్తిగా మార్చేశారు.ట్యాబ్‌లు అందించటంతోపాటు డిజిటల్ విద్యను అందిస్తున్నారు. టీచర్లు మాకు ఇంగ్లీషు మీడియంలో పాఠాలు బోధిస్తున్నారు.

– బత్తుల స్పందన, విద్యార్థిని

ధైర్యంగా చదివించుకుంటున్నాం..



అమ్మఒడి పథకం కింద ఏడాదికి రూ.15వేలు మా బ్యాంకు ఖాతాలో వేస్తున్నారు. దీంతో పిల్లలను ధైర్యం చదివించుకుంటున్నాం. పాఠశాల తెరిచిన రోజునే ఉచితంగా విద్యాకానుక పేరుతో చదువుకు అవసరమైనవి అన్నీ అందిస్తుండటంతో నిశ్చింతగా ఉన్నాం.

– పోలేపల్లి లక్ష్మీతిరుపతమ్మ, పెనుగంచిప్రోలు

నాణ్యమైన విద్యను అందిస్తున్నాం..



ప్రభుత్వం విద్యారంగంలో తీసుకువచ్చిన నూతన సంస్కరణలతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపడ్డాయి. 8వతరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు అందించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ విద్య అందుతోంది.

– ముక్కా సత్యనారాయణ, టీచర్, పెనుగంచిప్రోలు



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష



కంచికచర్ల : స్థానిక మిక్ ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో ఆదివారం గ్రూప్–2 స్క్రీనింగ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష ఉదయం పదిన్నర గంటలకు ప్రారంభంకాగా, అరగంట ముందుగానే అభ్యర్థులు పరీక్షాకేంద్రానికి చేరుకున్నారు. ఈ కేంద్రంలో 1653మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకాగా, 347మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రం వద్ద నందిగామ రూరల్ సర్కిల్ సీఐ పీ.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించడంతోపాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి,

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

నందిగామ: మండలంలోని లచ్చపాలెంలోగల వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దాతల సహాయంతో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామానికి చెందిన నెలకుర్తి సైదమ్మ ఆశ్రమంలోని 15 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేయడంతోపాటు భోజనం ఖర్చులకు రూ 3,500 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో లింగాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆళ్ళ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని గ్రామాలు

నందిగామ: మండలంలోని తొర్రగుడిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు నిర్వహించనున్నందున ఏటిపట్టు గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు రూరల్ ఏఈ రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొర్రగుడిపాడు , కొణతమాత్మకూరు, దాములూరు, సోమవరం , రుద్రవరం, గోళ్ళమూడి, కమ్మవారిపాలెం, రాఘవాపురం, కొండూరు, మాగళ్లు, జొన్నలగడ్డ, రామిరెడ్డిపల్లి గ్రామాల పరిధిలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఏఈ వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

టిడ్కో గృహాల పనుల పరిశీలన



టిడ్కో గృహాల వద్ద పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, పక్కన టి.ప్రభాకర్, ఎం.బ్రహ్మం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని బలుసుపాడు రోడ్‌లో ఉన్న టిడ్కో గృహ సముదాయాల వద్ద ముమ్మరంగా సాగుతున్న మౌలిక సదుపాయాల కల్పన పనులను జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల వద్ద ప్రస్తుతం రోడ్లు, డ్రైయిన్లు, ఎలక్ట్రికల్ వర్క్‌లు, పైపులైన్లు, పెయింటింగ్, వాటర్ స్టోరేజ్ నిర్మాణం తదితర పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. పనులను త్వరితగతిన పూర్తిచేసి మార్చి మొదటివారంలో గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు తగు చర్యలు చేపట్టామన్నారు. పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. టిడ్కో ఇళ్ల వద్ద ఉన్న బండరాళ్లు కూడా తొలగించాలని ఆదేశించారు. అన్ని పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి మార్చి మొదటివారంలో లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేస్తామని ఆయన వివరించారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, నాయకులు పింగళి నర్సింహారెడ్డి, పాటి సాంబ, శేషం ప్రసాద్, గోలి శ్రీను, శ్రీనివాస బ్రహ్మం, ఎలక్ట్రికల్ ఏడీ శ్రీనివాసరావు ఉన్నారు.

రైతు సంక్షేమానికి సీఎం జగన్ కృషి



జమ్మవరంలో సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, టి.పద్మావతి, కె.లక్ష్మి

జమ్మవరం(వీరులపాడు): రైతుల సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో పని చేస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని జమ్మవరంలో కేడీసీసీబి, సీడీఎఫ్ నిధులు రూ.31లక్షలతో నూతనంగా నిర్మించిన సొసైటీ భవనం, గోడౌన్‌ను కేడీసీసీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతితో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్వీర్యమైన వ్యవసాయ ప్రాథమిక పరపతి సహకార సంఘాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిస్థాయిలో బలోపేతం చేస్తున్నారన్నారు. ముఖ్యంగా అన్నదాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ఏకైక ప్రభుత్వమని సీఎం జగనన్న నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని కొనియాడారు. రైతులకు పెట్టుబడి ఖర్చులకు రైతుభరోసా పథకం ద్వారా ఆర్థికసాయం అందించడంతోపాటు పండిన పంటలకు సైతం గిట్టుబాటు ధరలు కల్పిస్తూ అన్నదాతకు అండగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. కేడీసీసీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకే ప్రభుత్వం గోడౌన్‌లను నిర్మిస్తోందన్నారు. కేడీసీసీ బ్యాంకు ద్వారా రైతులకు తక్కువ వడ్డీకే పంట రుణాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్‌లు శీలం సంధ్య, మల్లెల అనూష, ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, పీఏసీఎస్ చైర్మన్ శీలం రామకృష్ణారెడ్డి, నాయకులు శీలం భాస్కర్‌రెడ్డి, నన్నెబోయిన తిరుమలరావు, యాదాల దాసు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బద్దూనాయక్ దంపతులకు ఘనసన్మానం



బద్దూనాయక్ దంపతులను సన్మానిస్తున్న గ్వార్బాయ్ సేవాసంఘం ప్రతినిధులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణానికి చెందిన లాహోరి బద్దూనాయక్ వైఎస్సార్ సీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో బద్దూనాయక్, బాలమ్మ దంపతులను గ్వార్బాయ్ సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. సంఘ గౌరవ అధ్యక్షుడు ధరావత్ బాల్యానాయక్, సంఘ ప్రతినిధి మాడావత్ శ్రీనివాసనాయక్, మహిళా అధ్యక్షురాలు శ్యామల, గోపినేనిపాలెం సర్పంచ్ బాణావత్ శ్రీనివాసనాయక్, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ నాయకుడు గుగులోతు సైదానాయక్, వత్సవాయి ఎంఈవో నాగరాజు, పలువురు బంజారా సోదరులు తరలివచ్చి బద్దూనాయక్ దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో పలు తీర్మానాలు చేశారు. బద్దూనాయక్‌కు రాష్ట్ర పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నిరూపిస్తే.. రాజకీయాల నుంచి తప్పుకుంటాం

- నందిగామ అభివృద్ధిపై చర్చకు సిద్ధం..
- 30ఏళ్లుగా లేని అభివృద్ధిని ఐదేళ్లలో చేశాం
- ప్రతిపక్ష నాయకులకు దృష్టిలోపం
- కళ్లు కనిపించకపోతే వైద్యం చేయిస్తానని వ్యాఖ్య
- ప్రతిపక్షాల తీరుపై ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ ఫైర్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్

నందిగామ టౌన్: ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహనరావు సోదరుల కారణంగా మాకు అన్యాయం జరిగింది..నష్టం కలిగించారు..మమ్మల్ని ఆర్థికంగా దోచుకున్నారు అని నందిగామ నియోజకవర్గంలోని ఏ ఒక్కరితోనైనా చెప్పిస్తే.. తాము రాజకీయాల నుంచి తప్పుకుంటామని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ ప్రతిపక్ష టీడీపీ నాయకులకు సవాల్ విసిరారు. స్థానిక రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ఆయా ప్రశ్నలకు అరుణకుమార్ సమాధానమిస్తూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దోచుకోవడం.. దాచుకోవడం అనే విధానంలోనే ఆపార్టీ నాయకులు పని చేశారన్నారు. గత మూడు దశాబ్దాలుగా నందిగామ నియోజకవర్గంలో ఎవ్వరూ చేయలేని అభివృద్ధిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఈ ఐదేళ్లలో చేసి చూపించామని స్పష్టం చేశారు. నందిగామలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని ప్రతిపక్ష నాయకులు మాట్లాడుతున్నారని, అందరికీ కనిపిస్తున్న అభివృద్ధి ప్రతిపక్షాలకు కనిపించకపోవడం వారిలోని దృష్టిలోపాలకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. అటువంటి వారికి శంకర కంటి ఆస్పత్రిలో ఉచితంగా వైద్యం చేయిస్తానని వ్యాఖ్యానించారు. నందిగామలో సీఎం రోడ్డు విస్తరణ చేశామన్నారు. చందర్లపాడు, రామన్నపేట రోడ్లు విస్తరించి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నందిగామకు ఆర్డీవో కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, రెండు అర్బన్ హెల్త్ క్లినిక్‌లు, రిజర్వాయర్, పైపులైన్ నిర్మాణంతోపాటు నందిగామలో సీసీరోడ్లు, డ్రైనేజీలు, ప్రధాన రోడ్లు నిర్మించామన్నారు. నియోజకవర్గంలోని వందలాది కోట్లతో గ్రామాల్లో సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం, పాఠశాలల అభివృద్ధి, సీసీరోడ్లు, మంచినీటి పైపులైన్ల నిర్మాణం, పేదలకు ఇళ్లస్థలాల పంపిణీ చేపట్టినట్లు గుర్తుచేశారు. రూ.35లక్షలతో నూతన రథం ఏర్పాటు చేశామన్నారు. శివాలయం అభివృద్ధికి రూ.1.30 కోట్ల నిధులతో శంకుస్థాపన చేశామని, రూ.44కోట్లతో చేపట్టనున్న 100 పడకల ఆస్పత్రికి కూడా రెండుమూడురోజుల్లో శంకుస్థాపన చేస్తామని వివరించారు. నందిగామలో ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయంలో రానున్న విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇవన్నీ అభివృద్ధి పనులు కాదా? ఇవేవి ప్రతిపక్ష నాయకులకు కనపడటం లేదా? అని ఎమ్మెల్సీ అరుణకుమార్ ప్రశ్నించారు. నందిగామలో జరిగిన అభివృద్ధిని సామాన్య ప్రజలను ఎవరిని అడిగినా చెబుతారని, ప్రతిపక్ష నాయకులు మాత్రం స్వార్థ రాజకీయాలతో అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బాబులు పాలించారు.. ఆ తరువాత బాబుల చేతిలో బందీలు పాలించారు' అందుకే ప్రతిపక్ష టీడీపీ హయాంలో మూడు దశాబ్దాలపాటు నందిగామను అభివృద్ధి చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. తమ పాలనలో అవినీతి, అక్రమాలకు తావు లేదన్నారు. ఎవరైనా ఏదైనా అడిగితే నిబంధనల మేరకు చేయమని చెప్పామే తప్ప, నిబంధనలు అతిక్రమించి చేయమని ఎన్నడా చెప్పలేదని స్పష్టం చేశారు.

కేశినేని గురించి మాట్లాడే అర్హత లేదు..

విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) గురించి మాట్లాడే అర్హత టీడీపీ నాయకులకు లేదని ఎమ్మెల్సీ అరుణకుమార్ పేర్కొన్నారు. నలుగురు కూడా ఆయన వెంట రాలేదు.. ఆయన ఎలా గెలుస్తారు? అని అంటున్న నాయకులు.. 2019లో ఆయన సత్తా ఏంటో చూసినవారే కావడం గమనార్హమన్నారు. విజయవాడ లోక్‌సభాస్థానం పరిధిలో ఆరుగురు ఎమ్మెల్యే అభ్యర్థులు ఓడినా, ఎంపీగా గెలిచిన మొనగాడు కేశినేని నాని అని గుర్తు చేశారు. ఎంపీ కేశినేని నాని, టాటా ట్రస్ట్‌తో కలసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఇకనైనా టీడీపీ నాయకులు చౌకబారు రాజకీయాలు మానుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ వారికి హితవు పలికారు.

రూ.1.30కోట్లతో ఆలయ అభివృద్ధి



ఆలయం వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆలయాల అభివృద్ధితోపాటు నూతన ఆలయాల నిర్మాణాలకు సైతం పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. స్థానిక శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో రూ.1.30కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆదివారం వారు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా స్వామివారిని దర్శించుకని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన రామలింగేశ్వర స్వామివారి ఆలయం అభివృద్ధి విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి దేవాదాయశాఖ ద్వారా రూ.1.30 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఈనిధులతో నాలుగు ఉపాలయాలు, పవళింపుసేవ, అద్దాల మండప నిర్మాణం, ప్రసాదాల తయారీకి వంటషెడ్డు, స్ట్రాంగ్ రూం, నందీశ్వరుని విగ్రహానికి పైభాగంలో మండపం, ఆలయ చైర్మన్, ఈవో కార్యాలయ భవనాల నిర్మాణం, ఫ్లోరింగ్, విద్యుత్ వైరింగ్, ఆలయానికి రంగులు, జనరేటర్, సోలార్ ప్యానల్స్ ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు చేపతామని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అనేక ఆలయాలను కూల్చివేయగా, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నూతన ఆలయాల నిర్మాణంతోపాటు ఆలయాల పునఃనిర్మాణాలు, అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని వారు గుర్తుచేశారు. ముఖ్యంగా తమ హయాంలో రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆలయానికి రూ.35లక్షలతో నూతనరథాన్ని తయారు చేయించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రాజా వాసిరెడ్డి మురళీ రాఘవకుమార్, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, చల్లా బ్రహ్మేశ్వరరావు, గుడివాడ సాంబశివరావు, పాములపాటి రమేష్, ఓర్సు జ్వాలా, గరికపాటి భాస్కరం, సముద్రాల మధు, నల్లమల్లి మురళి, ట్రస్ట్ బోర్డు సభ్యులుగా నియమితులైన కాపా రవీంద్రనాథ్, సూరె రామారావు, ఉన్నం గోపాలకృష్ణ, కర్రి రవీంద్ర, పోలవరపు లక్ష్మి, కొత్తపల్లి లక్ష్మమ్మ, విదితే రాధాబాయి, ఆతుకూరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు లోక కళ్యాణార్థం చంద్ర వ్రతం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాఘ మాసం సోమవారం పురస్కరించుకుని లోక కళ్యాణార్థం శివజ్ఞాన పీఠాధిపతి శివాచార్య స్వామి వారి చేతుల మీదుగా శివజ్ఞానపీఠంలో చంద్ర వ్రతం (సోమ వ్రతం) నిర్వహించనున్నట్లు పీఠం ఆర్గనైజర్ పేర్ల శ్యాంప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 5.30 గంటలకు చంద్రవ్రతం ప్రారంభమవుతుందన్నారు. మానసిక ఆందోళన నివారణ , లోక కళ్యాణార్థం చేపట్టిన శ్రీచంద్ర వ్రతంలో భక్తులు ఉచితంగా పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు వ్రతంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.